సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనాలివ్వాలి



నిరసన తెలుపుతున్న సపోర్టింగ్ స్టాఫ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని బస్తీ దవాఖాన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అడ్వైజర్ ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాల పెరుగుదలను అమలు చేయాలని, బ్లడ్ శాంపిల్స్ రవాణా భత్యం, వ్యత్యాసం పేమెంట్ ఇప్పించాలని కోరారు. సపోర్టింగ్ స్టాఫ్‌కు 5 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదే విధంగా దీపావళి పండుగ బోనస్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అంజాద్ అలీఖాన్, ఉప్పలయ్య, శాంతమ్మ, స్వప్న, విజయ్, పద్మ, లావణ్య, సౌందర్య, అనిత, నర్సింహ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై పోలీసుల ఫోకస్

- పరిష్కారం దిశగా ప్రత్యేక డ్రైవ్
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- మార్పు రాకుంటే జరిమానా తప్పదని హెచ్చరిక



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ ముత్తుయాదవ్

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ట్రాఫిక్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ట్రాఫిక్ సమస్యాత్మక ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ట్రాఫిక్ జామ్ అయ్యే కూడళ్లల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి ముంబాయి జాతీయ రహదారిలోని మెట్రో పిల్లర్స్, యూటర్న్‌లు, భాగ్యనగర్ కాలనీ మెట్రో స్టేషన్, ఉషా ముళ్లపూడి రోడ్డు, వివేకానందనగర్ చౌరస్తా, కూకట్‌పల్లి బస్టాప్, ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్ యూటర్న్, వై జంక్షన్, జేఎన్‌టీయూ చౌరస్తాలలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిమెంట్, ఐరన్ భారీకేడ్‌లను ఏర్పాటు చేశారు. రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులను పలు మార్లు హెచ్చరించినా మార్పు కనిపించకపోవటంతో రాంగ్ పార్కింగ్ చేసే వారిపై జరిమానా విధించడానికి ముందస్తుగా ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. వ్యాపార సముదాయాలు పార్కింగ్ స్థలం కేటాయించే విధంగా వారికి అవగాహన కల్పిస్తున్నారు. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలకు భారీ జరిమానా తప్పదని ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్ హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు సహకరించాలని కోరారు.





భాగ్యనగర్ కాలనీ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు, అధికారులు

నేటి స్త్రీ సంస్థ ఆధ్వర్యంలో 3కే వాక్



3కే వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఐడీఎల్ చెరువు వద్ద నేటి స్త్రీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 3కే వాక్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మహిళలకు మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో వ్యాయామం చేసుకోవడానికి అనుకూలంగా పార్కులకు పెద్ద పీట వేశారని, అందులో భాగంగానే హైదరాబాద్‌లో మొట్టమొదటి మహిళా పార్కును కూకట్‌పల్లిలో ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని నేటి స్త్రీ సంస్థ వారికి సూచించారు.

విఠల రుక్మిణీ మందిరంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లోని విఠల రుక్మిణీ మందిరంలో శ్రీ హరినామ పఠనం చివరి రోజు సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. మరాఠీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, పంచశీల స్కూల్ కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, రమేష్‌గౌడ్, కె. గోపాల్, వై. శ్రీనివాస్, మనోజ్, వెంకటేష్, ఆలయ నిర్వాహకులు ఉమాకాంత్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు చిరుకానుక



ఉద్యోగులకు కానుకలు అందజేస్తున్న డీఎం హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సావిత్రి

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో దసరా ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి డిపోకి ఇచ్చిన టార్గెట్ అధిగమించినందుకు ఉద్యోగులందరికీ శనివారం డీఎం హరి చిరు కానుకలు అందజేశారు. డిపోకు రూ.14.13 లక్షల టార్గెట్‌ను ఇవ్వగా రూ.16.10 లక్షలు సాధించారు. అదనంగా రూ.1.37 లక్షలు ఉద్యోగులు లాభాలు సాధించినందుకు అభినందించారు. ఉద్యోగులందరూ ఇదే ఉత్సాహంతో పని చేసి సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సావిత్రి, ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ విద్యుత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న బోరబండ సెక్టార్ ఏరియా ఏఈ సాయి తేజను శనివారం ఎలక్ట్రిసిటీ విద్యుత్ యూనియన్(సీఐటీయూ) గ్రీన్ లాండ్ అధ్యక్షులు ఎస్ఎస్ఎం పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి చిన్న వయసులో విధులు నిర్వహిస్తున్న ఏఈ సాయి తేజ మరెన్నో పదోన్నతులు పొంది మరింత మందికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శరత్, వెంకటేష్, శ్రీకాంత్, వెంకటేష్, రవీందర్, పాష తదితరులు పాల్గొన్నారు.



ఏఈ సాయి తేజను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

తరలిన కాంగ్రెస్ కార్యకర్తలు

మోతీనగర్: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర శనివారం చార్మినార్ వద్ద ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పూర్వ మోతీనగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సద్భావన యాత్ర కమిటీ సభ్యులు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో చార్మినార్‌కు తరలి వెళ్లారు.

పరీక్షా కేంద్రాలను పర్యవేక్షణ



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, దూలపల్లి తదితర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించటంతోపాటు పలు సూచనలు చేశారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో పాల్గొన్న విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్‌లో శనివారం విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. భాగ్యనగర్‌లోని ముత్యాలమ్మ గుడిలోని దేవతా విగ్రహంపై దాడి, తెలంగాణ వ్యాప్తంగా హిందూ దేవాలయాలపై వరుస దాడులకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్ మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై దాడులను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. హిందువులంతా ఏక తాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్, సాయి, హరి, ప్రభాత్, తిరుపతి, ఉదయ్, భాను, దుర్గాసాయి, వినీత్, బన్నీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు



బహుమతి అందుకుంటున్న రాయదుర్గం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సాలీహతాజీన్

రాయదుర్గం: రామన్నగూడెంలోని వశిష్ఠ మోడల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను శనివారం నిర్వహించారు. డ్యాన్స్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ఓకల్ మ్యూజిక్, డ్రామా, స్టోరీ టెల్లింగ్, విజువల్ ఆర్ట్స్ వంటి విభాగాల్లో మండలస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయదుర్గం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్‌కే తాజ్‌బాబు మాట్లాడుతూ రాయదుర్గం జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి సాలీహతాజీన్ డ్రామా విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. అదే విధంగా విజువల్ ఆర్ట్స్ విభాగం జిల్లా స్థాయి పోటీల్లో అదే పాఠశాలకు చెందిన విక్రమ్ ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ఆయన, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

కూకట్‌పల్లి: నేషన్స్ బెనిఫిట్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా రాందేవ్‌రావ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 9 నుంచి 15 సంవత్సరాల లోపు ఉన్న 80 విద్యార్థినులకు హెచ్‌పీవీ వాక్సిన్ 2 డోసులను శనివారం ఉచితంగా అందజేశారు. రిక్షాపుల్లర్స్ కాలనీ జడ్పీహెచ్ఎస్ స్కూల్ జగద్గిరి గుట్ట విద్యార్థినులకు ఈ వ్యాక్సిన్ అందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సెక్రటరీ జె మీరారావు, అపర్ణ పాల్గొన్నారు. ఉచిత వ్యాక్సినేషన్‌కు ఆర్థికంగా సహకారం అందించిన నేషన్స్ బెనిఫిట్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎస్, పత్తికొండ, టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ కమలాకర్, హెచ్ఎం కిషన్, సీఈఓ యోబు, మేరి డేవిడ్, కల్పన, రమాదేవి, లలిత, శ్రావణ్‌రెడ్డి, రవీందర్, రామ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జహంగీర్, కీర్తిగుప్తా, ప్రిన్సిపాల్ రవి

రాయదుర్గం: విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటే అవకాశాలు మెండుగా ఉంటాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వై. జహంగీర్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'ఎంబీఏ ఫ్రెషర్స్–నెక్స్ట్–జెన్–మేనేజర్స్' అనే అంశంపై శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో టెక్నాలజీలో అనేక మార్పులు వస్తాయని, అందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ఉపయోగాలు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ఆలోచించాలన్నారు. చదువు, ఇతర పనులపై ఒక ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. హైదరాబాద్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ కోశాధికారి కీర్తి గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో కేవలం చదువుంటే సరిపోదని, అవసరానికి అనుగుణంగా నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని, సర్టిఫికెట్ కోర్సులపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ రవి మాట్లాడుతూ యేటా మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రమశిక్షణ, కష్టపడేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకునేలా, వారిలో నైపుణ్యాలు మెరుగుపడేలా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సుధీర్, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ డీ శ్రీలత, కే శ్వేత, కే భారతి, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో మైఓన్ ట్రబుల్డ్ వరల్డ్ చిత్రప్రదర్శన





చిత్రప్రదర్శనను తిలకిస్తున్న రమణారెడ్డి తదితరులు, ఆకట్టుకుంటున్న చిత్రాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ పేరిట శనివారం నిర్వహించిన చిత్రప్రదర్శనను హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంఈ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో పేయింటింగ్స్, స్కల్పర్స్ అందుబాటులో ఉంచారు. దాదాపు 100కి పైగా వర్క్‌లను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈనెల 28 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

19,756 ఎకరాల్లో పంటలు



యాసంగిలో పంట సాగుకు కార్యాచరణ ఖరారు చేసిన వ్యవసాయశాఖ

సాక్షి,సిటీబ్యూరో: యాసంగి పంట సాగుకు కార్యాచరణ ప్రణాళిక జిల్లా వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 19,756 ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనాతో ప్రతిపాదనలను రూపొందించిన వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో ఆరుతడి పంట సాగుకు అనుగుణంగా ఉద్యానవన పంటలతోపాటు జొన్న, సజ్జ, శనగ, అపరాలను పండించుకునేలా రైతుల్లో అవగాహన కల్పిస్తోంది.

- జిల్లాలోని 10 మండలాల పరిధిలో పలు రకాల పంటలను సాగు చేస్తారు. జిల్లాలో ఘట్కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్, మేడిపల్లి మండలాల్లో 13,788 ఎకరాల్లో వరి పంటను సాగు చేయనుండగా, జొన్న, మొక్కజొన్న, శనగలు, గోధుమ ఇతర పంటలను 691 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. 5,465 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసేలా ప్రతిపాదనలు చేశారు. ఇందులో 2,657 ఎకరాల్లో కూరగాయ పంటలు, 2,808 ఎకరాల్లో పండ్లు, తీగ జాతి పంటలు, పూతోటలు రైతులు సాగు చేసేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రతి రైతుకు 5 ఎకరాలకు మించకుండా సబ్సిడీ విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తంగా 7,458 క్వింటాళ్లకు సంబంధించి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. వీటిలో 4455 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 52 క్వింటాళ్ల జొన్న విత్తనాలను 6 కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందజేయడానికి కసరత్తు చేస్తోంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్తు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.

110 కోట్ల పంట రుణాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

సాగు చేయని భూములకు.. రైతు భరోసా కట్..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం భూములు కూడా పంట సాగు నోచుకోవటం లేదని తెలుస్తోంది. అయితే రైతు భరోసా పథకం కింద జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, వీటికన్నింటికి రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం నిధులిస్తోంది. రైతు భరోసాను పరిగణలోనికి తీసుకుంటే పడావు భూముల (పంట సాగు కాని భూముల)కు కూడా రైతు భరోసా పథకం వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ జిల్లాలో సాగు భూమి ఎంత..? పంట సాగు చేయని పడావుగా భూములు ఎన్ని ఉన్నాయన్న విషయంపై ఆరా తీస్తోంది. దీంతో పంట సాగు లేని భూములకు రైతు భరోసా అందజేసే విషయంలో తుది నిర్ణయంపై సర్కారు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యాసంగిలో రైతులకు అన్నీ అందుబాటులో..



యాసంగిలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట సాగుకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాం. పలు రకాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తాం. జిల్లాలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాల పంపిణీ లక్ష్యం నిర్ణయించాం.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

హెచ్‌సీయూలో 'క్లీనప్ డ్రైవ్'





హెచ్‌సీయూలో క్లీనప్‌డ్రైవ్ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'క్లీనప్‌డ్రైవ్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య ఆధ్వర్యంలో వలంటీర్లు క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆ విభాగం డీన్ ప్రకాశ్ గౌతం, ఫ్యాకల్టీ, విద్యార్థులు కూడా వలంటీర్లతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎండు ఆకులు,కలుపు మొక్కలు చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే పరిసరాల్లో ఎండిన దుంగలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడాది పొడవునా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో ఎన్ఎస్ఎస్, శానిటేషన్, హర్టికల్చర్ విభాగాలు సమష్టిగా చేసే కార్యక్రమంలో విద్యార్థులు కూడా భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీంసింగ్, వలంటీర్లు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమం అనంతరం పరిశుభ్రంగా కనిపిస్తున్న పరిసరాలు

రూపురేఖలు మార్చిన ఎన్ఎస్ఎస్ యూనిట్

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రాంగణంలో క్లీనప్ డ్రైవ్ తర్వాత ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. ఇంతకుముందు ఉన్న పెరిగిన గడ్డి, చిన్నచిన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో అక్కడి పరిసరాలు శుభ్రంగా కనిపిస్తున్నాయి.

జేఎన్‌టీయూలో సూర్య నమస్కారాల పోటీ



పోటీలో పాల్గొన్న విద్యార్థులు, యోగాభ్యాసకులు

కేపీహెచ్‌బీకాలనీ: మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో శనివారం జేఎన్‌టీయూలో 108 సూర్య నమస్కారాల పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ పాఠశాలల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యోగా టీచర్లు, మియాపూర్, మాదాపూర్, జనగాం విద్యార్థులు, యోగా టీచర్లు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు. విశ్వ మానవతా సంస్థ అధ్యక్షులు శ్రీనివాస చౌదరి జన్మదినం సందర్భంగా ఆయన పిలుపు మేరకు వివిధ పాఠశాలల్లో వ్యక్తిత్వం అంటే ఏమిటి?, నీవు వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకోవాలనుకుంటున్నావు అనే అంశంపై వివిధ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, ఉత్తమ యోగ సాధకులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా నిమ్స్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.